క్లుప్తంగా

తల్లికి వందనం పథకం అమలుచేయాలి

కార్పొరేటర్ సత్యబాబు



వించిపేట(విజయవాడపశ్చిమ): స్థానిక 50వ డివిజన్ మరుపిళ్ల చిట్టి, కస్తూరి సీతారామయ్య ఎలిమెంటరీ స్కూల్లో శనివారం మెగా పేరెంట్స్ మీటింగ్ నిర్వహించారు. ముఖ్యఅతిథిగా కార్పొరేటర్ బోయి సత్యబాబు పాల్గొని మాట్లాడారు. కూటమి ప్రభుత్వం ఎన్నికల్లో ఇచ్చిన హామీ మేరకు తల్లికి వందనం పథకం ద్వారా ఒక్కో విద్యార్థికి రూ. 15 వేలు వెంటనే అందించాలని డిమాండ్ చేశారు. మధ్యాహ్న భోజనంలో సన్న బియ్యం వండాలని, పెరుగుతున్న ధరలకు అనుగుణంగా మెనూ చార్జీలు పెంచాలని కోరారు. పాఠశాల ప్రాంగణంలో ఆట స్థలాలు ఉండేలా చూడాలని తెలిపారు. విద్యార్థుల్లో ఐకమత్యం పెంపొందించేలా దేశభక్తి అంశాలు, నైతిక విలువలు పెరిగేలా సత్ప్రవర్తన అంశాలను పాఠ్యపుస్తకాలలో ఉంచాలని విజ్ఞప్తి చేశారు. అనంతరం పాఠశాలలో జరిగిన ముగ్గుల పోటీల్లో గెలుపొందిన పేరెంట్స్‌కి బహుమతులు ప్రదానం చేశారు. కార్యక్రమంలో పాఠశాల హెచ్ఎం అరుణకుమారి, ఉపాధ్యాయులు, పేరెంట్స్ కమిటీ సభ్యులు, తల్లిదండ్రులు పాల్గొన్నారు.

లైసెన్స్ లేకుండా వ్యాపారం చేస్తే చర్యలు

కమిషనర్ ధ్యానచంద్ర

ఔపటమట(విజయవాడతూర్పు): ట్రేడ్ లైసెన్స్ లేకుండా వ్యాపారం చేస్తే కఠినమైన చర్యలు తప్పవని విజయవాడ నగర పాలక సంస్థ కమిషనర్ ధ్యానచంద్ర హెచ్చరించారు. నగర పర్యటనలో భాగంగా శనివారం ఆయన పటమట 12వ డివిజన్ అయ్యప్పనగర్ పరిసర ప్రాంతాల్లో పర్యటించారు. వ్యాపారసంస్థల ట్రేడ్ లైసెన్స్‌లను ను తనిఖీ చేశారు. పలువురు వ్యాపారులకు లైసెన్స్ లేకపోవడం గమనించి వారిని వెంటనే లైసెన్స్ తీసుకునేలా చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించారు. ఈ సందర్భంగా కమిషనర్ మాట్లాడుతూ లైసెన్స్ ఉంటేనే వ్యాపారం చేయాలని, శానిటరీ ఇన్స్పెక్టర్లు ఎప్పటికప్పుడు పర్యవేక్షిస్తూ ట్రేడ్ లైసెన్సులు తనిఖీ చేయాలని ఆదేశించారు. డివిజన్లలో పారిశుద్ధ్య నిర్వహణ సక్రమంగా జరగాలని, సైడ్ డ్రైన్‌లో తరచుగా సిల్టు తొలగించాలని సూచించారు. ఆయన వెంట చీఫ్ ఇంజనీర్ ఆర్.శ్రీనాథ్, ఇంచార్జి మెడికల్ హెల్త్ ఆఫీసర్ డాక్టర్ సురేష్‌బాబు ఉన్నారు.

భక్తులకు వసతుల కల్పనే ధ్యేయం



పెనుగంచిప్రోలు: భక్తులకు మౌళిక వసతుల కల్పనే ప్రధాన ధ్యేయమని చైర్మన్ జంగాల శ్రీనివాసరావు, ఈవో బీహెచ్‌వీఎస్ఎన్ కిషోర్ కుమార్ తెలిపారు. గ్రామంలో వేంచేసి ఉన్న తిరుపతమ్మవారి ఆలయ పాలకవర్గ సమావేశం శనివారం నిర్వహించారు. ఈ సందర్భంగా అభివృద్ధి పనులకు సంబంధించి అంచనాలు ఆమోదించటంతో పాటు పలు అంశాలపై చర్చించారు. అమ్మవారి దేవస్థాన ప్రాంగణంలో గార్డెనింగ్ విస్తరణ, పాపమాంబ వనం నందు, దేవస్థానం చుట్టూ స్టీల్ లైట్ పోల్స్ ఏర్పాటుకు రూ.37.50 లక్షలుతో అంచనాలు ఆమోదించారు. అలాగే నూతనంగా నిర్మించిన కల్యాణ మండపంలో ఏసీ ఏర్పాటుకు రూ.45 లక్షలు, మినీ ఫంక్షన్‌హాల్స్, కల్యాణ మండపంలో జనరేటర్స్ ఏర్పాటుకు రూ.83 లక్షలు, డైనింగ్ హాల్, కిచెన్, జనరేటర్ గది నిర్మాణానికి రూ.2.50 కోట్లుతో అంచనాలు ఆమోదించామని చెప్పారు. అలాగే అమ్మవారి ఆలయంలో సంతాన లక్ష్మీ పూజ టికెట్ రూ.100 నుంచి రూ.200కు పెంపు, నూతన ఆర్జిత సేవగా వేద ఆశీర్వచనం టికెట్ రూ.500 ఏర్పాటుకు దేవదాయ శాఖ కమిషనర్‌కు నివేదిక పంపటంపై ఆమోదం తెలిపారు. కార్యక్రమంలో ఈఈ ఎల్ రమ, ఏఈఓ ఉమాపతి, తిరుమలేశ్వరరావు, ఏఈ రాజు, పాలకవర్గ సభ్యులు పాల్గొన్నారు.

అలరించిన సంగీత కచేరి



విజయవాడ కల్చరల్: స్థానిక దుర్గాపురంలోని శివరామకృష్ణ క్షేత్రంలో నిర్వహిస్తున్న సంగీత ఉత్సవాల్లో భాగంగా శనివారం చెన్నైకి చెందిన సాంతూర్ కృష్ణ రామరత్నం ఆలపించిన సంప్రదాయ కీర్తనలు అందరినీ అలరించాయి. పెరవలి నందకుమార్, పెరవలి విజయభాస్కర్, కే హరిబాబు వాద్య సహకారం అందించారు. స్వరఝరి కార్యదర్శి మోదుమూడి సుధాకర్ కృష్ణ రామరత్నం సంగీత విశేషాలను వివరించారు. సంగీత విద్వాంసుడిని ఆత్మీయంగా సత్కరించారు. కార్యక్రమంలో అంజనా సుధాకర్, వేమూరి విశ్వనాథ్ తదితరులు పాల్గొన్నారు.

శిథిలావస్థలో మోడరన్ చేపల మార్కెట్

- నిరుపయోగంగా మారిన వైనం
- దేవినేని ఉమా మాటల మనిషి..చేతలు నిల్
- రూ.53 లక్షలు ప్రజాధనం వృథాపై కాలనీ వాసుల ఆగ్రహం



చేపల మార్కెట్ భవనం

భవానీపురం(విజయవాడపశ్చిమ): లక్షలాది రూపాయల ప్రజాధనం ఖర్చు పెట్టినా ఆశించిన లక్ష్యం మాత్రం చేరుకోకపోవడంపై ప్రజలు మండిపడుతున్నారు. 'వట్టి మాటలు కట్టిపెట్టవోయ్..గట్టి మేల్ తలపెట్టవోయ్' అన్న మహాకవి గురజాడ వారి దేశభక్తి గేయం అందరికీ సుపరిచితమే. బహూశా మాజీ మంత్రి దేవినేని ఉమామహేశ్వరరావు వంటి వ్యక్తుల గురించే ఆ నాడు గురజాడ రాసి ఉంటారు. ఉమా ఏ పని తలపెట్టినా లేదా ప్రారంభించినా అది మాటలకే పరిమితం తప్ప ప్రజలకు మేలు కలిగించేది ఒక్కటి లేదని ప్రజలు వ్యాఖ్యానిస్తున్నారు. విజయవాడ నగర శివారు ప్రాంతంలోని జక్కంపూడి వైఎస్సార్ కాలనీలో ఉమా ప్రారంభించిన మోడరన్ చేపల మార్కెట్ అందుకు ప్రత్యక్ష సాక్షిగా నిలుస్తుంది. ఎస్ఎఫ్‌డీబీ నిధులు రూ.53 లక్షల వ్యయంతో నిర్మించి 2017 డిసెంబర్ 24న ఆయన రిబ్బన్ కటింగ్ చేసి వెళ్లిన నాటి నుంచి నేటి వరకు క్లోజింగే. ఒక్క రోజుకూడా వినియోగించింది లేదని, ఎందుకు నిర్మించారో..ఎందుకు మూసేశారో అర్థం కావడం లేదని కాలనీవాసులు జుట్టు పీక్కుంటున్నారు. 'రాజుల సొమ్ము రాళ్ల పాలయినట్లు రూ.53 లక్షలు ప్రజాధనాన్ని వృథా చేయటంపై స్థానికులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. వైఎస్సార్ కాలనీలో మంచినీటి కొరత తీరుస్తానని 2019 ఎన్నికలకు ముందు దేవినేని ఉమ మంచినీటి రిజర్వాయర్ నిర్మాణానికి శంకుస్థాపన చేసి వదిలేసిన విషయాన్ని గుర్తు చేసుకుంటూ ఆయన మాటల మనిషేగానీ చేతలు నిల్ అంటూ వైఎస్సార్ కాలనీవాసులు ఎద్దేవా చేస్తున్నారు.

కాలనీలో 35 వేల మంది జనాభా...

జక్కంపూడి వైఎస్సార్ కాలనీలో సుమారు 35 వేలకుపైగా జనాభా ఉన్నారు. వారందరూ చేపలు కొనుక్కునేందుకు ఎక్కడికో వెళ్లాల్సిన అవసరం లేకుండా కాలనీలోనే ఏర్పాటు చేయాలనుకోవడం హర్షణీయమే. ఈ క్రమంలోనే ఏడేళ్ల క్రితం కాలనీలో ఉమా ప్రారంభించిన మోడరన్ చేపల మార్కెట్‌లో చేపలు విక్రయించేందుకు ఒక భవనం, దాని వెనుక చేపలు శుభ్రం చేసేందుకు మరొక భవనం నిర్మించారు. అయితే అది ఈ రోజు వరకు నిరుపయోగంగా పడి ఉండటాన్ని ప్రజలు జీర్ణించుకోలేక పోతున్నారు. ఏ ప్రయోజనాన్ని ఆశించి మార్కెట్ నిర్మించారో అది నెరవేరనప్పుడు ఉండీ ఉపయోగమేమిటని స్థానికులు ప్రశ్నిస్తున్నారు. చేపలు విక్రయించుకునేందుకు నిర్మించిన భవనం ముందు డస్ట్ బిన్లు, భవన నిర్మాణ సామగ్రి పెట్టుకుంటున్నారు. వెనుక ఉన్న చేపలు శుభ్రం చేసే భవనం పరిస్థితికూడా సేమ్ టు సేమ్. ఈ రెండు భవనాలు, వాటి శిలాఫలకం చుట్టూ పిచ్చి మొక్కలు పెరిగి అపరిశుభ్ర వాతావరణం నెలకొంది. ప్రజారోగ్య శాఖ అధికారులు ఏం చేస్తున్నారనేది ప్రశ్నార్థకం.



ఉమా ప్రారంభించిన శిలాఫలకం

అందుబాటులోకి తీసుకురావాలి



జక్కంపూడి వైఎస్సార్ కాలనీలో ప్రజల కోసమంటూ మోడరన్ చేపల మార్కెట్ ఏర్పాటు చేసి దేవినేని ఉమా మహేశ్వరరావు చేతులు దులుపున్నారు. దానిని వినియోగంలోకి తీసుకురావాలన్న ఆలోచన చేయకపోవడం బాధాకరం. ఇళ్లకు వచ్చి చేపలు అమ్ముకునేవారు కొన్న వాళ్ల ఇంటి ముందే శుభ్రం చేసి ఇచ్చేస్తున్న నేపథ్యంలో పారిశుద్ధ్య సమస్యలు ఏర్పడుతున్నాయి. ఆరోగ్య సమస్యలు వస్తే సరైన చికిత్స చేయించుకునే స్తోమతుకూడా లేని పేద ప్రజలను దృష్టిలో పెట్టుకుని మోడరన్ చేపల మార్కెట్‌ను అందుబాటులోకి తీసుకురావాలి.

– నక్కా ప్రభుదాస్, కాలనీవాసి

కమిషనర్ ప్రత్యేక పూజలు



గాంధీనగర్(విజయవాడసెంట్రల్): సుబ్రహ్మణ్య షష్టిని పురస్కరించుకొని మునిసిపల్ కమిషనర్ హెచ్ ఎం ధ్యానచంద్ర దంపతులు శ్రీకాశీవిశ్వేశ్వర అన్నపూర్ణ దేవస్థానంలో శనివారం ప్రత్యేక పూజలు చేశారు. దేవతామూర్తులకు పాలాభిషేకం చేశారు. స్వామివారికి 11 రకముల ద్రవ్యములతో సర్ప సూక్త సహిత రుద్రాభిషేకం నిర్వహించారు. 10మంది జంటల చేత స్వామివార్ల కళ్యాణం జరిపించారు.

13న నిరసన కార్యక్రమం

మధురానగర్: రైతుల విషయంలో కూటమి ప్రభుత్వ నిర్లక్ష్యాన్ని నిరసిస్తూ ఈనెల 13న వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ పోరాటానికి సిద్ధమైందని వైఎస్సార్ సీపీ సెంట్రల్ నియోజకవర్గ సమన్వయకర్త, మాజీ ఎమ్మెల్యే మల్లాది విష్ణు శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. కూటమి సర్కారు అధికారంలోకి వచ్చాక అన్నదాతలను రోడ్డున పడేసిందన్నారు. తుపాను ప్రభావంతో వర్షాలు కురుస్తాయని తెలిసినా, రైతులను అప్రమత్తం చేయలేదని మండిపడ్డారు. ఫలితంగా రైతులు పగలూరాత్రీ తేడా లేకుండా ధాన్యం రాశుల వద్ద రోజులతరబడి కాపలా కాయాల్సిన దుస్థితి నెలకొందన్నారు. పంటల కొనుగోలు ప్రణాళిక రూపకల్పనలో ప్రభుత్వం దారుణంగా విఫలమైందని దుయ్యబట్టారు.

సుబ్రహ్మణ్యస్వామికి విశేష అభిషేకాలు



స్వామికి అభిషేకాలు నిర్వహిస్తున్న అర్చకులు



కల్యాణోత్సవం జరిపిస్తున్న ఆలయ అర్చకులు

చిట్టినగర్(విజయవాడపశ్చిమ): షష్ఠిని పురస్కరించుకుని చిట్టినగర్ పరిధిలోని పలు ఆలయాల్లో సుబ్రహ్మణ్య స్వామి వారికి విశేష అభిషేకాలు, అర్చనలు నిర్వహించారు. కొత్తపేట ఆంజనేయ వాగు సెంటర్‌లోని వీరాంజనేయ స్వామి వారి ఆలయంలో వేం చేసిన శ్రీ సుబ్రహ్మణ్యస్వామి వారికి పసుపు, చందనం, విభూది, పన్నీరు. పాలు వంటి 11 రకాల సుగంధ ద్రవ్యాలు, పంచామృతాలతో అభిషేకాలు నిర్వహించారు. ఆలయ అర్చకులు విన్నకోట శ్రీనివాసరావు శర్మ స్వామి వారికి అభిషేకాలు జరిపించిన అనంతరం విశేషంగా అలంకరించారు. షష్ఠిన స్వామి వారికి జరిగే విశేష అభిషేకాల్లో పాల్గొన్న భక్తులకు సకల కార్యాల్లో విజయం సిద్ధిస్తుందని, అనేక రకాల దోషాలు తొలగిపోతాయని పేర్కొన్నారు.

పంచహారతుల సేవ....

అనంతరం స్వామి వారికి పంచ హారతుల సేవ నిర్వహించగా, పెద్ద ఎత్తున ఉభయదాతలు, భక్తులు పాల్గొన్నారు. ఆలయ ఈవో రావూరి వెంకటేశ్వరరావు, ఆలయ చైర్మన్ నందిపాటి శ్రీనివాసరావు, కమిటీ సభ్యులు ఏర్పాట్లను పర్యవేక్షించారు. చిట్టినగర్ సొరంగం కొండ ప్రాంతంలోని స్వయంభు వల్లీ దేవసేన సమేత కళ్యాణ సుబ్రహ్మణ్య స్వామి వారి దేవస్థానంలో స్వామి వారికి అభిషేకాలు, కల్యాణోత్సవం జరిగింది. ఉదయం స్వామి వారికి సుప్రభాత సేవ, స్వామి వారికి పంచామృత అభిషేకాలు జరిగాయి. అనంతరం స్వామి వారిని పెండ్లి కుమారుడిగా అలంకరించిన అనంతరం ఆలయ ప్రాంగణంలో కల్యాణోత్సవాన్ని వైభవంగా నిర్వహించారు. మధ్యాహ్నం స్వామి వారి అన్న ప్రసాద వితరణ చేయగా, పెద్ద ఎత్తున భక్తులు విచ్చేసి స్వామి వారి ప్రసాదాలు స్వీకరించారు. సాయంత్రం ఆలయ ప్రాంగణం నుంచి ఊరేగింపు నిర్వహించగా, మేళతాళాలు, మంగళ వాయిద్యాల నడుమ సాగింది. ఊరేగింపులో ఆలయ కార్యనిర్వాహకులు తొత్తడి నాగరాజు, వెంకట లక్ష్మీ దంపతులతో పాటు స్థానిక పెద్దలు, ఉభయదాతలు, భక్తులు పాల్గొన్నారు. రాత్రి స్వామి వారికి పవళింపు సేవ జరిగింది.

దుర్గమ్మ సన్నిధిలో సుబ్రహ్మణ్య స్వామి కల్యాణం

ఇంద్రకీలాద్రి(విజయవాడపశ్చిమ): షష్ఠిని పురస్కరించుకుని ఇంద్రకీలాద్రిపై దుర్గమ్మ సన్నిధిలో శ్రీ వల్లీ దేవసేన సమేత సుబ్రహ్మణ్య స్వామి వారి కల్యాణోత్సవం శనివారం అంగరంగ వైభవంగా నిర్వహించారు. అమ్మవారి ఆలయ ప్రాంగణంలోని ధర్మపథం వేదికపై శ్రీవల్లీ దేవసేన సమేత సుబ్రహ్మణ్య స్వామి వార్ల ఉత్సవ మూర్తులకు కల్యాణోత్సవాన్ని ఆలయ అర్చకులు జరిపించారు. తొలుత ఆలయ ప్రాంగణంలోని స్వామి వారి ఆలయం నుంచి ఉత్సవ మూర్తులకు మేళతాళాలు, మంగళ వాయిద్యాల నడుమ ఊరేగింపుగా కళ్యాణ వేదిక వద్దకు ఊరేగింపుగా తీసుకొచ్చారు. ఉత్సవ మూర్తుల వద్ద తొలుత గణపతి పూజ, అనంతరం స్వామి వారి కల్యాణాన్ని ఆలయ అర్చకులు అంగరంగ వైభవంగా జరిపించారు. ఆలయ ఈవో కెఎస్. రామరావు దంపతులు కల్యాణోత్సవంలో పాల్గొన్నారు. అనంతరం ఉత్సవ మూర్తులకు ఊరేగింపుగా నిర్వహించగా, పలువురు ఉభయదాతలు, భక్తులు పాల్గొన్నారు. కల్యాణోత్సవంలో పాల్గొన్న పాల్గొనడం ద్వారా ఆర్థిక ఇబ్బందులతో పాటు వివాహం కాని వారికి వివాహ యోగం, సంతానం లేని వారికి సంతాన యోగం కలుగుతాయని ఆలయ వైదిక కమిటీ సభ్యులు పేర్కొన్నారు.

పారిశుద్ధ్య నిర్వహణపై సమీక్ష



ప్రజారోగ్య విభాగంపై సమీక్ష చేస్తున్న వీఎంసీ కమిషనర్ ధ్యానచంద్ర

పటమట(విజయవాడతూర్పు): నగరంలో పారిశుద్ధ్య నిర్వహణకు ప్రత్యేక డ్రైవ్‌లు నిర్వహించాలని, డివిజన్లలో వ్యర్థాలు పేరుకుపోయిన ప్రాంతాలను గుర్తించేందుకు సిబ్బంది డ్రోన్లను వినియోగించాలని వీఎంసీ కమిషనర్ ధ్యానచంద్ర సూచించారు. వీఎంసీ ప్రధాన కార్యాలయం నూతన భవనంలోని సమావేశ మందిరంలో ప్రజారోగ్య విభాగం అధికారులు, క్షేత్రస్థాయి సిబ్బందితో శనివారం ఆయన సమీక్ష నిర్వహించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ డ్రోన్ల ద్వారా వ్యర్థాలు పేరుకుపోయిన ప్రాంతాలను గుర్తించి, స్పెషల్ డ్రైవ్ ద్వారా తొలగించాలని సిబ్బందిని ఆదేశించారు. పారిశుద్ధ్య నిర్వహణలో శానిటరీ ఇన్‌స్పెక్టర్ల పాత్ర కీలకమని, అన్ని ప్రాంతాల్లో పారిశుద్ధ్య నిర్వహణ లోపం లేకుండా చూడాలన్నారు. పారిశుద్ధ్య నిర్వహణకు కావాల్సిన తోపుడు బండ్లు, వ్యర్థ సేకరణ వాహనాలు సమకూర్చుకోవాల్సిన బాధ్యత సిబ్బందిదేనని స్పష్టం చేశారు. డివిజన్లలో పెండింగ్‌లో ఉన్న ట్రేడ్ లైసెన్స్ రుసుం వసూలు చేయాలన్నారు. వ్యర్థాలను తరలించే వాహనాలపై నల్లటి కవర్ కప్పాలని, వ్యర్థాలు ఎక్కువ ఉన్న ప్రాంతాల్లో స్పెషల్ డ్రైవ్ నిర్వహించాలని కమిషనర్ ఆదేశించారు. సమావేశంలో ఇంచార్జ్ చీఫ్ మెడికల్ హెల్త్ ఆఫీసర్ డాక్టర్ సురేష్ బాబు, సూపరింటెండింగ్ ఇంజనీర్ పీ సత్యకుమారి,అసిస్టెంట్ మెడికల్ హెల్త్ ఆఫీసర్లు డాక్టర్ రామకోటేశ్వరరావు, డాక్టర్ బాబు శ్రీనివాసరావు, ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ ఇంచార్జ్ వెహికల్స్ ఏసుదాసు, శానిటరీ ఇన్‌స్పెక్టర్లు, సూపర్‌వైజర్లు పాల్గొన్నారు.

బ్యాంకర్ల సహకారంతో సైబర్ నేరాల నియంత్రణ

పోలీస్ కమిషనర్ ఎస్.వి.రాజశేఖరబాబు



గవర్నర్‌పేట బీవోబీ అధికారులను సత్కరిస్తున్న పోలీస్‌కమిషనర్ రాజశేఖరబాబు

విజయవాడస్పోర్ట్స్: ముందస్తు అవగాహన, జాగ్రత్తలు పాటించడం ద్వారా నేరాలకు అడ్డుకట్ట వేయవచ్చని జిల్లా పోలీస్ కమిషనర్ ఎస్.వి.రాజశేఖరబాబు పేర్కొన్నారు. భారీ సైబర్ నేరం జరగకుండా అడ్డుకున్న బ్యాంక్ ఆఫ్ బరోడా(బీవోబీ)గవర్నర్‌పేట బ్రాంచ్ మేనేజర్ సూర్యనారాయణ, అధికారులు ఆంజనేయులు, భానులను శనివారం తన కార్యాలయంలో కమిషనర్ రాజశేఖరబాబు ఘనంగా సత్కరించారు. కమిషనర్ మాట్లాడుతూ ఈనెల ఆరో తేదీన ఓవ్యక్తి కంగారుగా బ్యాంక్‌కు వచ్చి తనఖాతాలోని నగదును వేరే వ్యక్తి ఖాతాలోకి బదిలీ చేయాలని బ్యాంకు అధికారులు ఆంజనేయులు, భానులను కోరగా అనుమానం వచ్చిన వారు ఈ విషయాన్ని వెంటనే మేనేజర్ సూర్యనారాయణ దృష్టికి తీసుకెళ్లారన్నారు. గతంలో బ్యాంకు సిబ్బందికి తాము ఇచ్చిన ప్రశ్నావళి ఆధారంగా సదరువ్యక్తి సైబర్ నేరానికి గురయ్యాడని మేనేజర్ గ్రహించి వెంటనే అతని బ్యాంకుఖాతాను సీజ్ చేసి నగదు వేరే ఖాతాలకు బదిలీ కాకుండా జాగ్రత్తలు తీసుకున్నారని అభినందనీయమన్నారు. డిజిటల్ అరెస్ట్, కస్టమ్ అధికారుల పేరుతో వస్తున్న ఫేక్ ఫోన్‌కాల్స్‌ను నమ్మి మోసపోవద్దని ప్రజలకు సూచించారు. పోలీస్‌శాఖ, బ్యాంకు సిబ్బంది సమన్వయంతో వ్యవహరిస్తూ ఇటువంటి సైబర్ నేరాలు జరుగకుండా అడ్డుకోవాలని బ్యాంకర్లను కోరారు.

ప్రభుత్వ పాఠశాల అభివృద్ధికి అండగా ఉంటా



సర్టిఫికెట్లను అందిస్తున్న ఎమ్మెల్యే సుజనా చౌదరి



విద్యార్థులకు భోజనం వడ్డిస్తున్న దృశ్యం

వన్‌టౌన్(విజయవాడపశ్చిమ): ప్రభుత్వ పాఠశాలల అభివృద్ధికి అండగా ఉంటానని పశ్చిమ నియోజకవర్గ శాసనసభ్యులు వై. సుజనాచౌదరి తెలిపారు. వన్‌టౌన్‌లోని గాంధీజీ మున్సిపల్ హైస్కూల్లో శనివారం జరిగిన తల్లిదండ్రులు, ఉపాధ్యాయుల ఆత్మీయ సమావేశానికి సుజనాచౌదరి ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఈ విధమైన కార్యక్రమం ద్వారా పాఠశాలల్లో అమలు చేస్తున్న విద్యా ప్రమాణాలు, మౌలిక సదుపాయాలు, విద్యార్థుల ప్రతిభ గురించి అవగాహన వస్తుందన్నారు. ఎన్టీఆర్ వంటి మహనీయులు చదివిన గాంధీజీ పాఠశాలలో విద్యా ప్రమాణాలను, విద్యార్థులలో ఉత్తీర్ణత శాతం పెంచాలని ఉపాధ్యాయులకు సూచించారు. ఉపాధ్యాయుల సమస్యలను అడిగి తెలుసుకున్నారు. ప్రభుత్వ పాఠశాల విద్యార్థులు ప్రైవేటు పాఠశాలలకు దీటుగా ఉత్తీర్ణత సాధించాలన్నారు. గాంధీజీ పాఠశాలను మోడల్ స్కూల్ గా అభివృద్ధి చేసే బాధ్యతను తీసుకుంటానని హామీ ఇచ్చారు. కార్యక్రమంలో పాఠశాల యాజమాన్యాల కమిటీ చైర్మన్ జెట్లింగ్ శంకర్, ప్రధానోపాధ్యాయులు మల్లికార్జునరెడ్డి, ఎంఈవోలు సోమశేఖర్ నాయక్, నరసింహాచార్యులు, పేరెంట్స్ కమిటీ చైర్మన్ కొత్తమాసు వెంకట పిచ్చయ్య, కూటమి నేతలు ఎంఎస్ భేగ్, ఆడ్డూరి శ్రీరామ్, పైలా సురేష్, తదితరులు పాల్గొన్నారు.

జూనియర్ కళాశాల విద్యార్థులకు మధ్యాహ్న భోజనం

భవానీపురం(విజయవాడపశ్చిమ): విద్యాధరపురంలోని కబేళా వద్దగల ప్రభుత్వ జూనియర్ కళాశాల (ఉర్దూ) విద్యార్థులకు మధ్యాహ్న భోజనం పథకానికి నాంది పలికారు. అక్షయపాత్ర సహకారంతో సుజనా ఫౌండేషన్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన సుజన విద్యాన్నపూర్ణ పథకాన్ని పశ్చిమ ఎమ్మెల్యే యలమంచిలి సత్యనారాయణ (సుజన) చౌదరి శనివారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఇటీవల ఈ కళాశాలను సందర్శించిన సమయంలో విద్యార్థులు మధ్యాహ్న భోజనానికి ఇబ్బందులు పడుతున్న విషయం తన దృష్టికి వచ్చిందని తెలిపారు. దీంతో కళాశాలలో చదువుతున్న 188 మంది విద్యార్థులకు తన సొంత ఖర్చులతో సుజన విద్యాన్నపూర్ణ పథకాన్ని ఏర్పాటు చేసినట్లు చెప్పారు. ఏడాది పొడవున ఈ పథకాన్ని అమలు చేస్తామని తెలిపారు. మరి కొన్ని కళాశాలల్లోనూ ఈ కార్యక్రమాన్ని త్వరలో ప్రారంభిస్తామని పేర్కొన్నారు. అక్షయపాత్ర సంస్థ ప్రతినిధులు చక్రధరి దాస్, రామ రాఘవ దాస్, కాలేజి ప్రిన్సిపాల్ హాఫీజ్ షేక్ అహ్మద్, డిస్ట్రిక్ట్ ఒకేషనల్ ఎడ్యుకేషన్ ఆఫీసర్ వెంకటరెడ్డి, ఎంఎస్ బేగ్, అడ్డూరి శ్రీరామ్, నాగుల్‌మీరా, బబ్బూరి శ్రీరామ్, మైలవరపు కృష్ణ తదితరులు పాల్గొన్నారు.

పాఠశాల అభివృద్ధికి కృషి చేయాలి

కార్పొరేటర్ రెహమతున్నీసా



భవానీపురం(విజయవాడపశ్చిమ): కార్పొరేట్ పాఠశాలలకు ధీటుగా మున్సిపల్ పాఠశాలలో మౌలిక సదుపాయాలను కల్పించి అభివృద్ధి చేయాలని 38వ డివిజన్ వైఎస్సార్ సీపీ కార్పొరేటర్ షేక్ రెహమతున్నీసా తెలిపారు. డివిజన్ పరిధిలోని మల్లికార్జునపేటలోగల అడపా రాములు మున్సిపల్ ఎలిమెంటరీ పాఠశాలలో శనివారం జరిగిన తల్లిదండ్రులు, ఉపాధ్యాయుల సమావేశానికి ఆమె ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా రెహమతున్నీసా మాట్లాడుతూ ఉపాధ్యాయులు అంకిత భావంతో విద్యార్థులకు బోధన చేయాలని సూచించారు. తల్లిదండ్రులు కూడా తమ పిల్లలను పాఠశాలకు పంపితే సరిపోదని, వారి చదువుపట్ల ప్రత్యేక శ్రద్ధ వహించాలని కోరారు. చదువుతోపాటు క్రీడా, సాంస్కృతిక రంగాల్లో శిక్షణ ఇవ్వాలని తెలిపారు. అనంతరం విద్యార్థులతో కలిసి మధ్యాహ్న భోజనం చేశారు. పాఠశాల హెచ్ఎం జి. ప్రియాంక, పేరెంట్స్ కమిటీ చైర్మన్ జి.వెంకట శిరీష, వైస్ చైర్మన్ ఎ.శ్రీదేవి పాల్గొన్నారు.

నైపుణ్యాలకు పదును పెట్టాలి



బహుమతులు అందిస్తున్న అతిథులు

వన్‌టౌన్(విజయవాడపశ్చిమ): విద్యార్థులు తమలోని నైపుణ్యాలకు పదును పెట్టినప్పుడే విజయాలను సాధిస్తారని కరూర్ వైశ్యాబ్యాంకు ఏజీఎం ఎస్.మురళీకృష్ణ తెలిపారు. కేబీఎన్ కళాశాల ప్రజ్ఞ క్లబ్ విభాగం ఆధ్వర్యంలో శనివారం 'వైబ్రన్స్' పేరుతో అంతర కళాశాలల పోటీలు జరిగాయి. ఈ సందర్భంగా జరిగిన ప్రారంభ సభకు ముఖ్యఅతిథిగా పాల్గొన్న మురళీకృష్ణ మాట్లాడుతూ విద్యార్థి దశ నుంచి పోటీతత్వాన్ని అలవరచుకోవాలని సూచించారు. సృజనాత్మక విజ్ఞానాన్ని, వ్యక్తిత్వ వికాసాన్ని పెంపొందించేందుకు పోటీలు దోహదం చేస్తాయన్నారు. చీఫ్ మేనేజర్ పీవీబీ రావుగుప్త మాట్లాడుతూ విద్యార్థుల్లో కలిగే ఆందోళన, ఒత్తిడిలను తగ్గించి వారిలో సృజనాత్మకత వెలికితీసేందుకు పోటీలు దోహదం చేస్తాయని పేర్కొన్నారు. కళాశాల కార్యదర్శి టి.శ్రీనివాసు, హిందూ హైస్కూల్స్ కమిటీ ఏవో డాక్టర్ నారాయణరావు, కళాశాల ప్రిన్సిపాల్ టి.శ్రీనివాసు, క్లబ్ కన్వీనర్ బి.మోహన్‌తేజ, అధ్యాపకులు ప్రకాష్, ఆసియాబేగం పాల్గొన్నారు. కృష్ణా విశ్వవిద్యాలయ అంతర్ కళాశాలల పురుషుల టేబుల్ టెన్నిస్ పోటీల్లో కేబీఎన్ కళాశాల టేబుల్ టెన్నిస్ జట్టు చాంపియన్ షిప్ కైవసం చేసుకుందని ఆ కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ జి.కృష్ణవేణి తెలిపారు. ఈ నెల పదో తేదీ నుంచి విట్ యూనివర్సిటీ (వెల్లూర్ తమిళనాడు)లో జరిగే దక్షిణ భారత అంతర్ విశ్వవిద్యాలయ పురుషుల టేబుల్ టెన్నిస్ పోటీలకు కళాశాల విద్యార్థులైన పి.రూపేష్, జి.కార్తీక్, ఎ.గోవింద్ ఎంపికయ్యారని తెలిపారు.

ధర్నా విజయవంతం చేయాలి



వీరులపాడు: వీవోఏల సమస్యలు పరిష్కరించాలని కోరుతూ ఈ నెల 13న విజయవాడలో చేపడుతున్న రాష్ట్ర వ్యాప్త ధర్నాను విజయవంతం చేయాలని యూనియన్ జిల్లా గౌరవాధ్యక్షురాలు కమల పిలుపునిచ్చారు. వీరులపాడులోని శనివారం వీవోఏల మండల కమిటీ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ వెలుగు యానిమేటర్స్ ఉద్యోగుల సంఘం (వీవోఏ) ఆధ్వర్యంలో చేపడుతున్న ధర్నాలో పెద్ద ఎత్తున పాల్గొనాలన్నారు. మూడేళ్ల కాలపరిమితి సర్క్యులర్‌పై కూటమి ప్రభుత్వం మాట తప్పిందని తెలిపారు. అంతే కాకుండా మూడేళ్ల కాలపరిమితి సర్క్యులర్ ఆధారంగా మూడేళ్లు పూర్తయిన వీవోఏలను మార్చుకోవచ్చని మంత్రి కొండపల్లి శ్రీనివాస్ మాట్లాడటం సమంజసం కాదని చెప్పారు. ఇప్పటికైనా ప్రభుత్వం స్పందించి హైకోర్టు ఆదేశాల మేరకు తొలగించిన వారిని విధుల్లోకి తీసుకోవటంతో పాటు తమ సమస్యలు పరిష్కరించాలని డిమాండ్ చేశారు. షేక్ చాంద్‌బేగం, ఆళ్ల ఉమాదేవి, లాల్ అహ్మద్ గౌస్, సుజాత, కవిత, నాగమ్మ, సుష్మిత, స్వాతి, ప్రశాంతి, తదితరులు పాల్గొన్నారు.

మరో విద్యుత్ పోరుకు సిద్ధం కావాలి



వీరులపాడు: విద్యుత్ బిల్లుల పెంపుపై మాట తప్పిన కూటమి ప్రభుత్వ తీరు, పెరిగిన విద్యుత్ బిల్లులపై పోరుకు సిద్ధం కావాలని సీపీఎం జిల్లా కార్యవర్గ సభ్యుడు కోట కళ్యాణ్ తెలిపారు. వీరులపాడు గ్రామంలోని పార్టీ కార్యాలయంలో శనివారం పార్టీ మండల కమిటీ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చి ఆరు నెలలు కూడా గడవకముందే రూ. 15,484 కోట్ల భారాన్ని ప్రజలపై మోపిందన్నారు. సర్దుబాటు చార్జీల పేరుతో ప్రజలపై భారం మోపటం బాధాకరమని ఆందోళన వ్యక్తం చేశారు. సర్దుబాటు చార్జీల భారానికి కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలతో పాటు రాజకీయ పార్టీలు బాధ్యత వహించాలని డిమాండ్ చేశారు. ఇప్పటికైనా కూటమి ప్రభుత్వం సర్దుబాటు చార్జీల భారాన్ని నిలిపివేయాలని లేకుంటే భారీ ఎత్తున ఆందోళన నిర్వహిస్తామని తెలిపారు. ఈ సమావేశంలో నాయకులు లాల్ అహ్మద్ గౌస్, చాట్ల రవి, పల్లెకంటి బాబు, అద్దంకి స్వామి, గుంజి వీరయ్య, చాంద్‌బేగం, గడ్డం ప్రభాకర్, తదితరులు పాల్గొన్నారు.